పెరటికోళ్ల పెంపకం.. నిరాశజనకం

- తీసుకువచ్చిన నాలుగైదు రోజుల్లోనే చనిపోతున్న కోళ్లు
- లబోదిబోమంటున్న 'మహిళాశక్తి' లబ్ధిదారులు
- ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన



వెంకట్‌రెడ్డిపల్లిలో చనిపోయిన కోళ్లు

గండేడ్/మహమ్మదాబాద్: మహిళాశక్తి పథకంలో భాగంగా చేపట్టిన పెరటి కోళ్ల పెంపకం మహిళా సంఘాల సభ్యులను నిరాశకు గురిచేస్తోంది. తీసుకువచ్చిన నాలుగైదు రోజుల్లోనే కోళ్లు చనిపోతుండటంతో మహిళలు లబోదిబోమంటున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యుల ఆసక్తి మేరకు పెరటికోళ్ల పెంపకానికి మహిళాశక్తి పథకం ద్వారా రుణాలను అందించారు. కోళ్లను అమ్మగా వచ్చిన డబ్బులతో తీసుకున్న రుణాన్ని వాయిదాల్లో చెల్లించాల్సి ఉంది. అయితే 45 రోజుల వయసు గల 300 కోళ్లను అడ్డాకుల మండలంలో కొనుగోలు చేసి.. మహమ్మదాబాద్ మండలంలోని 10 గ్రామాల్లో 24 మంది మహిళలకు పంపిణీ చేశారు. వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్, నంచర్ల తదితర గ్రామాల్లో పంపిణీ చేసిన కోళ్లు నాలుగైదు రోజుల్లోనే పెద్ద మొత్తంలో చనిపోయాయి. వెంకట్‌రెడ్డిపల్లిలో ఓ మహిళ 50 కోళ్లు తీసుకుంటే, దాదాపు 30కి పైగా చనిపోయినట్లు తెలిసింది. ఒక్కో కోడికి రూ. 150 నుంచి రూ. 154 చొప్పున వెచ్చించి కొనుగోలు చేశామని.. కోళ్లు అనారోగ్యంతో చనిపోతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

■ గండేడ్ మండలంలోనూ పెరటి కోళ్లు చనిపోతున్నాయి. రుసుంపల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో 140 మంది లబ్ధిదారులకు గాను దాదాపు 130 మందికి పెరటి కోళ్లను పంపిణీ చేశారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలకు వేర్వేరు వాహనాల్లో కోళ్లను తీసుకురావాల్సి ఉండగా.. ఒకే వాహనంలో తీసుకురావడంతో అనారోగ్యానికి గురై చనిపోతున్నట్లు తెలుస్తోంది. అయితే కోళ్లకు సంబంధించిన డబ్బులను ఇప్పటికే ఏపీఎంలు లబ్ధిదారుల నుంచి వసూలు చేశారు. చనిపోయిన కోళ్ల నష్టం ఎవరు భరిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

అధికంగా వసూలు..

పెరటి కోళ్ల కొనుగోలుకు సంబంధించి నిర్ణీత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో కోడిని రూ. 130 చొప్పున కొనుగోలు చేయగా.. రవాణా చార్జీలతో కలిపి రూ. 140 చొప్పున మహిళా సంఘాల సభ్యుల నుంచి తీసుకోవాల్సి ఉంది. అయితే మహమ్మదాబాద్ మండలంలో ఒక్కో కోడికి రూ. 150 నుంచి రూ. 154 వరకు వసూలు చేయగా.. గండేడ్ మండలంలో రూ. 150 చొప్పున వసూలు చేశారని లబ్ధిదారులు చెబుతున్నారు. ఓవైపు కోళ్లు చనిపోవడం.. మరోవైపు అధికంగా వసూలుతో అన్ని రకాలుగా నష్టపోయామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మహిళా సంఘాల సభ్యులకు నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

35 కోళ్లు చనిపోయాయి..



మహిళాశక్తి పథకంలో పెరటి కోళ్ల పెంపకానికి అవకాశం ఉందని చెప్పగా.. వాటి ద్వారా ఉపాధి పొందవచ్చని ఆశపడ్డాను. ఒక్కో కోడికి రూ. 154 చొప్పున చెల్లించాలని అధికారులు చెప్పారు. గతంలో తక్కువ ధర ఉండేది.. ఇప్పుడెందుకు అంత ధర అంటే ట్రాన్స్‌పోర్టుతో కలిపి అని అన్నారు. అయినా సరే అని ఒప్పుకొని 50 కోళ్లను కొనుగోలు చేశా. తీసుకున్న రెండు, మూడు రోజుల్లోనే 35 కోళ్లు చనిపోయాయి. వాటి స్థానంలో వేరే వాటిని ఇవ్వాలని అధికారులను కోరగా.. ఎలాంటి స్పందన లేదు.

– గిద్దలపాటి పరమేశ్వరి, వెంకట్‌రెడ్డిపల్లి

న్యాయం చేస్తాం..

ఒక్కో కోడిని రూ. 130 చొప్పున కొనుగోలు చేశాం. రవాణాతో కలిపి రూ. 140 చొప్పున వసూలు చేశాం. రూ. 154 తీసుకోలేదు. కోళ్ల యజమానికి ఇంకా డబ్బులు చెల్లించలేదు. చనిపోయిన వాటి గురించి మాట్లాడతాం. మహిళలకు న్యాయం చేస్తాం.

– సునీత, ఏపీఎం, మహమ్మదాబాద్

రవాణా చార్జీలతో కలిపి వసూలు

కోళ్ల ధరతో పాటు రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేశాం. నంచర్ల వరకు కోళ్లు రాగా.. అక్కడి నుంచి ఆటోల ద్వారా గ్రామాలకు సరఫరా చేశాం. అందుకోసమే రూ. 150 వసూలు చేశాం. అంతకు మించి ఎక్కడా అదనంగా వసూలు చేయలేదు.

– బాలకృష్ణ, ఏపీఎం, గండేడ్

క్లుప్తంగా

మైసమ్మ చెంత భక్తుల సందడి



నవాబుపేట: మైసమ్మ దేవాలయం చెంత ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని కాకర్లపహడ్ పంచాయతీ పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి దేవాలయం అడవి మధ్యలో ఉండటంతో అడవి మొత్తం జనసంద్రంగా మారింది. సెలవురోజు కావటంతో భక్తులు మొక్కులు చెల్లించేందుకు తరలివచ్చి అడవిలో సేదాతీరారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



మిడ్జిల్: జాతీయ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు మండలం నుంచి మాలల ఐక్య వేదిక సంఘం నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బంగారు, జంగయ్య, నందం, రామస్వామి, రామకృష్ణ, శివకృష్ణ, సాయి, శివ, చెన్నయ్య, దయాకర్, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లికి చెందిన ఎర్రజమ్మని చంద్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధితుడు త్వరగా కోలుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆదివారం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దయాకర్, శ్రీధర్‌యాదవ్, నర్సింహ, గణేష్, గురుభాస్కర్‌రెడ్డి, అంజనేయులు, వెంకటేష్, బలరాం ఉన్నారు.

కూతురు వివాహానికి..



రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులోని నందిగామకు చెందిన కప్పెరయాదయ్య కూతురు మంగ వివాహానికి ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు అభిమన్యురెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అభిమన్యురెడ్డికి ముదిరెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్‌లు వెంకటయ్యగౌడ్, శ్రీను ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సత్యయ్య, బాల్‌చెన్నయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సదర్‌ఉత్సవాలకు మండల నేతలు



నవాబుపేట: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన యాదవ సదర్ కార్యక్రమానికి మండలం నుంచి వివిధ గ్రామాల నాయకులు తరలి వెళ్లారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ నిర్వహించిన సదర్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆహ్వానించడంతో మండలం నుంచి భారీగా యాదవులు తరలినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు వాసుయాదవ్ తెలిపారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో యాదవ సంఘం నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ, వెంకటయ్య, నర్సింహులు, వెంకటేష్, వెంకటరాజు, తదితరులు ఉన్నారు.

నేడు రైతులకు లీగల్ చట్టాలపై అవగాహన

దేవరకద్ర రూరల్: వ్యవసాయ రంగానికి సంబంధించి లీగల్ చట్టాలపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏట అగర్వాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తితో పాటు, సంబధిత న్యాయవాదులు హాజరవుతారని, రైతులు ఈ సదస్సులో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రి రోడ్డు అధ్వానం



జడ్చర్ల టౌన్: ఏరియా ఆస్పత్రికి వెళ్లేరోడ్డు అధ్వానంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు 167వ నెంబరు జాతీయ రహదారి పక్క నుంచి ఒకమార్గం, పెట్రోల్‌బంక్ దాటాక ప్రైవేట్ వెంచర్‌లో నుంచి మరో మార్గం ఉంది. అయితే పెట్రోల్ బంక్ దాటాక ప్రైవేట్ వెంచర్‌రోడ్డు వర్షాలకు పూర్తిగా పాడైంది. ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేదు. ఉన్న మరో మార్గం సైతం ఇటీవల వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. దీంతో అడుగులోతు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తాత్కాలికంగా మొరం వేయించి గుంతలు పూడ్చాలని, సీసీరోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో సీపీఎం 9వ మహాసభలను పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు కిల్లె గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణంలో పేదలు పక్కా ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, సర్వే నెంబర్ 523 లో పట్టాలు కోల్పోయిన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీడీగుట్ట, తిమ్మసానిపల్లి, బోయపల్లి గేట్ల అండర్ గ్రౌండ్ లైన్ బ్రిడ్జిలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

ఒకే దేశం ఒకే ఎన్నికను వ్యతిరేకించండి

బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రతిపాదన ఒకే దేశం ఒకే ఎన్నికను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు పిలుపునిచ్చారు. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి ని ర్వహించాలన్న రాంనాథ్ కోవింద కమిటీ సిఫార్సులను కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్రకాంత్, వి.పద్మ, మోహన్, రాజ్‌కుమార్, వర్దగాలెన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నారాయణపేట రూరల్: ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడంపై తపస్ అధ్యక్షులు షేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రాగానే సకాలంలో బకాయి పడిన మూడు డీఏ లను విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పది నెలలుగా ఓపిక పట్టామని, మరో రెండు వాయిదాలు బకాయి పడడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కనీసం మూడు డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నవాబుపేట సంతలో ఉచిత భోజనం

- బారులుతీరుతున్న ప్రజలు



నవాబుపేట సంతలో భోజనం చేస్తున్న ప్రజలు

నవాబుపేట: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ప్రతి ఆదివారం సంతకు వచ్చే ప్రజలకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల ప్రజలంతా ఆదివారం నవాబ్‌పేట సంతకు వచ్చేందుకు ఉత్సాహం చూపుతూ బారులు కడుతున్నారు. రెండు నెలలుగా ఉచిత భోజనం ప్రతి ఆదివారం అందిస్తుండటంతో సంతకు వచ్చే ప్రజలు భోజనాలకు ఎగబడుతున్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగే సంతకు వచ్చే మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేకపోవటంతో మధ్యాహ్నం ఉచిత భోజనం అందించాలని నర్సింహాచారి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఉచిత భోజనం ఎంతో ప్రయోజనకరంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

స్టేడియంలో ఆస్ట్రో టర్ఫ్ వికెట్ ప్రారంభం



ఆస్ట్రోటర్ఫ్‌వికెట్ ప్రారంభిస్తున్న రాంరెడ్డి

జడ్చర్ల టౌన్: స్టేడియం మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ ప్రాక్టీస్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌ను ఆదివారం ఫ్లెవ్వాక్ అసోసియేషన్ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ప్రారంభించారు. స్టేడియంలో జడ్చర్ల క్రికెట్ అసోసియేషన్ ద్వారా క్రికెట్‌పై శిక్షణ ఇస్తున్నారు. గతంలో దాతల సహాయంతో నెట్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేవారు. స్టేడియం అభివృద్ధిలో భాగంగా నెట్ శిబిరాన్ని తొలగించారు. దీంతో కొన్నాళ్లుగా క్రికెట్ శిక్షణ ఇచ్చేందుకు సరైన వసతులు కరువయ్యాయి. దీన్ని గమనించిన అసోసియేషన్ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ఆస్ట్రో టర్ఫ్ వికెట్‌ను సొంతంగా ఏర్పాటు చేయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటైన వికెట్‌పై శిక్షణ పొందటం ద్వారా క్రీడాకారులు తమ పూర్తి నైపుణ్యాన్ని ప్రదర్శించటంతో పాటు సరైన శిక్షణ పొందేందుకు అవకాశం కలిగినట్టైంది. కార్యక్రమంలో కోచ్ మోయిన్, లగాన్ క్రికెట్ టీం, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గోపాష్టమి నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి

స్టేషన్ మహబూబ్‌నగర్: దీపావళి పండుగ తర్వాత వచ్చే గోపాష్టమిని ప్రతి గ్రామంలో నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు బి.నరసింహమూర్తి అన్నారు. జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలో గల గణేష్ భవన్‌లో ఆదివారం వీహెచ్‌పీ ప్రజాధికారుల సమావేశం నిర్వహించారు. గోపాష్టమి రోజు ప్రతి హిందూ కుటుంబం గోపూజలు నిర్వహించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కమిటీ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని గ్రామ కమిటీలు నిర్వహించాలన్నారు. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వచ్చే డిసెంబర్ 11న శౌర్య దివాస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవరే ప్రమాద సూచిక

- ఆదమరిస్తే అంతేసంగతులు
- ప్రమాదకరంగా రాయపల్లి రోడ్డు



రాయపల్లిరోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంత వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ కవరు

రాజాపూర్: ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని రాయపల్లి గ్రామానికి ఉన్న బీటీరోడ్డు కోసుకుపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడింది. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనదారులు, గ్రామస్తులు భయపడుతున్నారు. ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి రాయపల్లికి రెండున్నర కిలోమీటర్ల బీటీరోడ్డులో భారీ టిప్పర్లు అధికలోడ్‌తో వెళ్తుండడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఆదమరిచి అందులో పడితే ప్రాణాలకే ప్రమాదం ఉంది. కోసుకుపోయిన గుంతలో ప్రమాదకరమైన గోతి ఉందని గుర్తించేందుకు ఒక చిన్నపాటి కట్టెకు ఓ ప్లాస్టిక్ కవర్‌ను కట్టి ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో సమీపంలో ఉన్న పరిశ్రమల్లో పనిచేసేందుకు కార్మికులు, ఇతర ప్రాంతాల్లోని వారు సైతం ఈరోడ్డు గుండానే ప్రయాణిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ఉన్న గుంతకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎవరూ స్పందించడం లేదు..



వర్షపునీరు బయటకు వెళ్లేందుకు ఉన్న డ్రైయిన్ మూసుకుపోవడంతో వర్షపునీరు రోడ్డుపై నుంచి పారి బీటీరోడ్డు దెబ్బతిన్నది. కొన్ని వారాలుగా రోడ్డు కోసుకుపోయినా సంబంధిత ఇరిగేషన్ అధికారులు గానీ, ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ స్పందించడం లేదు. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేయించాలనే ఆలోచన ఎవరికీ రావడంలేదు. అందులో పడి ఎవరికైనా ప్రమాదం జరిగితే తప్పా స్పందించేలా లేరు.

– నవీన్‌కుమార్‌గౌడ్, రాయపల్లి

రెండురోజుల్లో డబ్బులు జమ చేయిస్తాం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



బీటీ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన రైతులకు రెండు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయిస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, సన్న వడ్లను రూ.2820 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. అక్కడే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కేఎల్‌ఐ నుంచి తిమ్మాయిపల్లి చెరువుకు కాల్వ ద్వారా వస్తున్న కృష్ణా జలాలకు పూజలు చేశారు. తర్వాత వర్నె వద్ద వాగులో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, భీమన్నయాదవ్, హేమవర్ధన్‌రెడ్డి, జనదీశ్వర్, వేణునాథ్, తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు మరమ్మతుకు శంకుస్థాపన

భూత్పూర్: తాటికొండ స్టేజీ జాతీయ రహదారి నుంచి తాటికొండ వరకు బీటీ మరమ్మతు పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి నుంచి తాటికొండ వరకు కిలోమీటర్నర్నరకు రూ.55 లక్షలు మంజూరయ్యాయి. అడ్డాకుల, మూసాపేట, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు తాటికొండ మీదుగా మహబూబ్‌నగర్‌కు ప్రతి నిత్యం వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు మొలవడంతోపాటు రోడ్డు గుంతలు ఏర్పడింది. దీంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. ఎమ్మెల్యే చొరవతో బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేస్తే సౌకర్య వంతంగా ఉంటుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హర్యానాయక్, ఆనంద్‌రెడ్డి, విజయకుమార్ గౌడ్, అంజద్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



వెంకటరమణ కాలనీలో మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోయేలా అందరం కలిసి అడుగులు వేద్దామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం పదో వార్డు పరిధిలోని వెంకటరమణ కాలనీలో పర్యటించారు. డ్రైయినేజీ వ్యవస్థ సరిగా లేదని, మట్టి రోడ్లే ఉన్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతం భూత్పూర్ మెయిన్ రోడ్డు కంటే కిందికి ఉండటంతో ఎక్కడికక్కడ మురుగు గుంటలుగా ఏర్పడి, ముళ్లపొదలతో నిండి పోయాయన్నారు. దీనికి చైర్మన్ స్పందించి త్వరలోనే డ్రైయినేజీలతోపాటు సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు టీడీగుట్టలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల చంద్రశేఖరరావుతో ఆలపించే అన్నమాచార్యుల 54వ సంకీర్తనల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తుల విశ్వాసం కోల్పోయిందని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగ వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తోందని, ఉద్యోగస్తుల ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

ముడా చైర్మన్‌కు సన్మానం

మరికల్: మహబూబ్‌నగర్ ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్‌ను ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. యాదవులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య, డీఎస్ చైర్మన్ శాంతన్న, ఓబీసీ చైర్మన్ కృష్ణయ్య, ప్రవీణ్, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మొగులప్ప, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంబా భవాని వార్షికోత్సవాలు

ధన్వాడ: మండల కేంద్రంలోని అంబా భవాని ఆలయంలో వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఎనిమిది సంవత్సరాలు పూర్తికావడంతో ఆదివారం అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడి సాధించవచ్చు



కోయిల్‌కొండ: రైతులు వ్యవసాయ రంగంలో సిరి పెరల్ సిరిసిడ్స్ విత్తనాల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఆ సంస్థ ఆర్‌ఎం అమర్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అంకిళ్ల గ్రామంలో ఆగ్రో రైతుసేవా కేంద్రం మరికల్ వారి ఆధ్వర్యంలో రైతు ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పంటలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రవినాయక్, నందు, సాయిబాబు, గోవిందుయాదవ్, చెన్నయ్య, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడిగా బుచ్చారెడ్డి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడిగా వట్టిపల్లి బుచ్చారెడ్డి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో జరిగిన పీఆర్టీయూ సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల నాయకుల ఏకాభిప్రాయం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చారెడ్డికి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

కేఎస్పీ వద్ద లైటింగ్ ఏర్పాటు చేయండి



కేఎస్పీ వద్ద నీటి గుంతలో పడిన కారు



దేవరకద్ర రూరల్: జిల్లాలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోయిల్‌సాగర్ వద్ద కనీస వసతులు లేక పర్యాటకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటికి తోడు ప్రాజెక్ట్ దగ్గర లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో చీకటి వేళలో ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. కొండపూర్, వింజమూర్, అంకిళ్ల, కోయిల్‌కొండతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లేందుకు దేవరకద్ర మీదుగా ఇదే ప్రధాన దారి కావడంతో ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల లేని సమయంలో అనేక మంది వాహనదారులు ఈ మార్గంలో తమ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో లైటింగ్ లేకపోవడంతో ప్రయాణికులు అక్కడే ఉన్న ప్రాజెక్ట్ నీటి గుంతలలో పడుతున్నారు. సంబధిత అధికారులు స్పందించి అక్కడ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రాజెక్ట్ ఈఈ చందులాల్‌ను సంప్రదించగా అధికారులతో మాట్లాడి లైటింగ్ వ్యవస్థను సరిచేస్తామని తెలిపారు.